27న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా వెల్లడి

విశాలాంధ్ర - కాకినాడ : ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా ఈనెల 27న ముసాయిదా ఓటరు జాబితా ముద్రణ చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. గురువారం కాకినాడ కలెక్టర్‌లో జిల్లాలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా.. రెవెన్యూ, ఎన్నికల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 రూపకల్పనలో భాగంగా జిల్లాలో జరుగుతున్న కార్యకలాపాలు, ఈవీఎంల తొలి దశ తనిఖీ వంటి అంశాలను కలెక్టర్..రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూలు ప్రకారం ఈనెల 27న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నామన్నారు. 2024-జనవరి 5న తుది ఓటరు జాబితా ముద్రించనున్నట్లు ఆమె తెలిపారు. తొలి దశ ఈవీఎం తనిఖీ ప్రక్రియ ఈ నెల 16 నుంచి కాకినాడ అంబేద్కర్ భవన్‌లో ప్రారంభమైందని ఇప్పటివరకు 50 శాతం ఈవీఎంల తనిఖీ పూర్తయ్యిందన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు పర్యవేక్షణలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు మధ్య ఈ తనిఖీ ప్రక్రియ అంతా సవ్యంగా సాగుతుందని, నవంబర్ 10 నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైసీపీ), చొడిశెట్టి రమేష్ బాబు (భాజపా), గదులు సాయి బాబా(టీడీపీ), ఆకుల వెంకట రమణ (ఐ.ఎన్.సీ), సబ్బారపు అప్పారావు(బీఎస్పీ), అతికంశెట్టి సత్యనారాయణ రావు (ఆప్), కలెక్టరేట్ ఎన్నికల డీటీ ఎం జగన్నాథం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

17,507 ఎకరాలలో ఖరీఫ్ పంట నమోదు

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలంలో ఖరీఫ్ 2023 సీజన్‌కు సంబంధించి మొత్తం 16 రైతు భరోసా కేంద్రాల్లో అన్ని పంటలు కలిపి 17,507 ఎకరాల్లో పంట నమోదైంది. వరి పంట మొత్తం 15,804 ఎకరాలు 10854 మంది రైతులు ఈ క్రాప్ చేసుకున్నారు. దానిలో భాగంగా గురువారం టేకి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కెవిఎస్ రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు సామాజిక తనిఖీ కోసం ఈ క్రాప్ ముసాయిదా జాబితా రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించనున్నట్టు తెలిపారు. రైతులు అందరూ తమ పేర్లు పంట రకం, సర్వే నంబర్స్ అన్నీ సరిగా ఉన్నాయో లేదో సరిచేసుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే సరిచేసుకోవడానికి చివరి ఈనెల 30. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ పుట్టా జానకి రామయ్య, ఉమ్మడిశెట్టి సూరిబాబు, పార్టీ ప్రెసిడెంట్ కుక్కల బాలయ్య, కుక్కల సతీష్, గ్రామ వ్యవసాయ సహాయకుడు జి. హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యం ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-దేవరపల్లి: పేద ప్రజల ఆరోగ్య సంక్షేమం ప్రభుత్వ ధ్యేయమని గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి మండలం రామన్నపాలెంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామ సర్పంచ్ కూచిపూడి బుల్లారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెట్టారని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూచిపూడి బుల్లారావు, మాజీ సర్పంచ్ కూచిపూడి వెంకటేశ్వరరావు, దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైద్యులు డి.సాంబశివరావు, గ్రామ కార్యదర్శి ఎన్. రవి కిషోర్, విఆర్‌ఓ ఎన్. అనిత తదితరులు పాల్గొన్నారు.

సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్‌లో విలువిద్య శిక్షణ

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్లో విలువిద్య శిక్షణను ప్రారంభించారు. ఈ తరగతులను స్కూల్ డైరెక్టర్ ఆర్. వేణుగోపాలరావు, సహస్ర ప్రిన్సిపాల్ గౌసియా బేగం, పీఈటి మోహినమ్మ, ఆర్. సత్య కుమార్ ప్రారంభించారు. విలువిద్యలో జాతీయస్థాయిలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన కర్రి బుద్దేశ్వరరావు విలువిద్య శిక్షణా తరగతులను విద్యార్థులకు నేర్పారు. శిక్షణలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కూల్ డైరెక్టర్ రవనం వేణుగోపాలరావు బహుమతులు అందజేశారు.

నవంబర్ 15న ప్రజా రక్షణభేరి జయప్రదం చేయండి

విశాలాంధ్ర - అమలాపురం : లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం విజయవాడలో నవంబర్ 15న సిపిఎం చేపట్టనున్న ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు చింతకాయల బాబూరావు అన్నారు. గురువారం సిపిఎం జిల్లా స్థాయి శిక్షణా తరగతులు స్థానిక గొల్లగూడెంలోని పార్టీ కార్యాలయంలో జరిగాయి. ముఖ్యవక్తగా విచ్చేసిన బాబురావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్ళు పూర్తి కావస్తోందన్నారు. కేంద్రంలోని బిజెపి నాయకులు ప్రత్యేక హెూదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు..రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, కడప ఉక్కు, రైల్వే జోన్ వంటి విభజన హామీలలో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రజల్ని నిలువునా మోసం చేసిన బిజెపి అంతటితో ఆగకుండా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును తెగనమ్మడానికి తయారైందన్నారు. దీనిని రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకుని ఈ దుర్మార్గమైన పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి పాలనలో మొత్తం దేశమే అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర నవంబర్ 07 తేదీన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటిస్తుందని రావులపాలెం, అమలాపురంలో బహిరంగ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నవంబర్ 15న విజయవాడలో జరిగే బహిరంగ సభకు జిల్లా నుండి వేలాది మంది తరలి వెళ్ళేందు సన్నదం అవుతున్నామని పార్టీ కార్యకర్తలు అంతా ఈకార్యక్రమం జయప్రదానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు కెవివి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. జిల్లా కమిటి సభ్యులు జి. దుర్గా ప్రసాద్, నాయకులు సూర్యప్రకాషరావు, వి. రాంబాబు, పాము బాలయ్య, కుడిపూడి రాఘవమ్మ, బీమాల శ్రీను, పి. శేషారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రత్తిపాడు మండలం లంపకలోవలో సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ గంటా సత్యనారాయణ 4వ వర్ధంతి సందర్భంగా కాకినాడ అంజు కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎంపీపీ సుధాకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి మండల ప్రెసిడెంట్ పంచాది వీరబాబు మాట్లాడుతూ మాజీ సర్పంచ్ గంటా సత్యనారాయణ సర్పంచిగా, సొసైటీ చైర్మన్‌గా పనిచేసి లంపకలోవ గ్రామాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చేసి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చినబాబు, సేరు కృష్ణ, బంకు శ్రీను, లోండ బాబు, గుడాల వెంకటరత్నం, ఏపూరి రామారావు, పిల్లా చిన్న, మామిడి నరసింహమూర్తి, పిల్లా పద్మరాజు, ఆకుల వీరబాబు, పినిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలను తక్షణమే ఆదుకోవాలి

విశాలాంధ్ర- రాజమండ్రి: తూర్పు, కాకినాడ జిల్లా మెట్ట ప్రాంతంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని వర్షాలు లేక, జలాశయాల్లో నీరులేక భూమిని నమ్ముకున్న రైతు -రైతు ను నమ్ముకున్న వ్యవసాయ కూలీ అర్థాకలితో అలమటిస్తున్నారని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు ఆవేదన వ్యక్తం చేశారు. కరువు నుండి వ్యవసాయ కూలీలను, పేదలను, రైతుల కుటుంబాలను ఆదుకోవడానికి తక్షణమే కరువు పరిస్థితులు అంచనావేసి, కరువు మండలాలుగా ప్రకటించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) రాష్ట్ర సమితి ఈనెల 25వ తేదీ నుంచి 30 వరకు అన్ని గ్రామ సచివాలయాల ముందు ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చింది. అందులో భాగంగా గురువారం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల, ధవళేశ్వరం, గోకవరం, మునుకోడలి గ్రామ సచివాలయాల వద్ద ధర్నాలు, వినతి పత్రాలు అందజేశారు. స్థానిక ఆనందనగర్ , కతేరు సచివాలయాల వద్ద జరిగిన ధర్నాలో మధు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు లేక ఈ సంవత్సరం తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ముఖ్యంగా రాయలసీమతో పాటు ప్రకాశం, ఉత్తరాంధ్ర, తూర్పు, కాకినాడ జిల్లాలలో అత్యంత దారుణంగా కరువు ఛాయలు ఏర్పడ్డాయని అన్నారు. కరువు నుండి పేదలను, వ్యవసాయ కూలీలను, రైతులను విముక్తి చేసి వలసలు ఆపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేద న్నారు. ప్రధానంగా వ్యవసాయ పనులు లేక గ్రామాలకు గ్రామాలే ఖాళీ అవుతున్నాయని, ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు, వ్యవసాయ కూలీలకు, రైతులకు, ఉపాధి చూపి ఆకలి తీర్చాలన్నారు. వ్యవసాయ కూలీలు, పేద కుటుంబాలకు నెలకు 10 వేల రూపాయలు కరువు పెన్షన్ తో పాటు నెల నెలా 35 కెజీల బియ్యం, ఇతర నిత్యవసర వస్తువులు ఉచితంగా ఇవ్వాలని మధు డిమాండ్ చేశారు. రైతులు వేసిన పంటలకు అనుగుణంగా, పంట నష్టం ఇవ్వాలని, అన్ని రకాల బ్యాంకుల రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో 200 రోజులు పని దినాలు, రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బికేఎంయు జిల్లా కార్యదర్శి తోట లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు కె. శ్రీనివాస్, సుజనమ్మ, నాగేశ్వరరావు, మంగ, రేఖ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు హక్కులు, బాధ్యతలు గుర్తెరగాలి

విశాలాంధ్ర - శంఖవరం : విద్యార్థులు హక్కులు బాధ్యతలు గుర్తెరిగి మసలాలని కాకినాడ జిల్లా దిశ వన్ స్టాప్ సెంటర్ కార్యనిర్వహణాధికారిణి ఆర్. శైలజ తెలిపారు. గురువారం ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి సూచనల మేరకు బాలికలకు బాల్య వివాహ నిరోధక 2006, పోక్సో చట్టంపై అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, పెద్దలపట్ల గౌరవంతో మెలగాలని, క్రమశిక్షణతో ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కత్తిపూడి సెక్టారు ఐసిడిఎస్ సూపర్వైజర్ బివి రజిని, అంగన్వాడి సిబ్బంది పి. పార్వతి, లోవ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంలో 2కోట్ల 59లక్షల అవినీతి

విశాలాంధ్ర - సీతానగరం: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సుమారు 2 కోట్ల 59 లక్షల రూపాయల అవినీతి జరిగిందని చినకొండేపూడి గ్రామస్తుడు లాయర్ చిడిపి నకుల సురేష్ విమర్శించారు. గురువారం సీతానగరంలో నకుల సురేష్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల స్థలాలు లేఅవుట్లు నింపడంను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టారు. దీనిలో సీతానగరం మండలం నుండి సుమారు మూడు కోట్ల 95 లక్షల 23 వేల రూపాయల గ్రామీణ ఉపాధి పథకం ద్వారా పనులు చేశారు. దీనిలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని అర్ టి ఐ ఏక్ట్ యాక్ట్ ద్వారా అడిగిన సమాధానాల ద్వారా తెలుస్తుంది. ఉపాధి హామీలు అవకతవకలు జరిగాయని పీఎంఓ కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఫిర్యాదు ద్వారా స్థానిక అధికారులకు దీనిపై రిపోర్ట్ సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిలో డ్వామా పిడి ఇచ్చిన లెక్కల ప్రకారం రైతుల వద్ద నుండి క్యూబిక్ మీటర్ 86 రూపాయలకు కొనుగోలు చేసినట్టు లెక్కలు చూపించారు. దీని ప్రకారం మూడు కోట్ల 21 లక్షల 93 వేల రూపాయల పనులు జరగగా క్యూబిక్ మీటర్ 86 రూపాయలు చొప్పున ఒక కోటి 35 లక్షల 36 వేల రూపాయలు పనులు జరిగాయి. అధికారులు ఇచ్చిన లెక్క ప్రకారం మూడు కోట్ల 95 లక్షల ఇరవై మూడు వేల రూపాయలు ఖర్చు చేసినట్లు చూపించారు. అంటే దీనిలో సుమారు రెండు కోట్ల 59 లక్షల రూపాయలు అవినీతి జరిగిందని స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. దీనిపై ఉన్నత అధికారులు చర్యలు చేపట్టి అవినీతి చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిచో ఉన్నత న్యాయస్థానం ద్వారా న్యాయం కోసం పోరాడతానని అన్నారు.

ప్రజారోగ్యంతో అధికారుల చెలగాటం

విశాలాంధ్ర - కాకినాడ : కొద్దో గొప్పో వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులు స్థానిక ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అనుచరుల దౌర్జన్యాలకు బలైపోతున్న విషయాన్ని తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్వయంగా పరిశీలించారు. కాకినాడ పెద్ద మార్కెట్ ప్రాంగణంలో ఉన్న పలు అంశాలపై ఆరోపణలు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ నిర్లప్తత కారణంగా స్తంభించి పోయిన డ్రైనేజీతో ఆ ప్రాంతమంతా దుర్గంధ భరితమైన వాసన వెదజల్లుతున్నా పట్టించుకోకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారన్నారు. తాత్కాలిక లీజు పొందినవారు నేడు స్థానిక ఎమ్మెల్యే ద్వారంపూడి అండచూసుకుని వీర్రవీగి పోతున్నారని మార్కెట్ ప్రాంతాన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుని సంఘవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తూ అలజడి సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటికైనా సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి కాకినాడ పెద్ద మార్కెట్ లోపల జరుగుతున్న దుర్మార్గ చర్యలు కారణంగా నష్టపోతున్న కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తెదేపా నగర అధ్యక్షుడు మాల్లిపూడి వీరు, కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు వమ్మి బాలాజీ, తుమ్మల రమేష్, చింతలపూడి రవి, గదుల సాయి బాబా, మార్కెట్ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : త్రాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న సరిపల్లి గ్రామ దళితుల సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. సరిపల్లి గ్రామ శివారు బాబా నగర్‌లో 40 కుటుంబాలు 200 పైగా దళిత ప్రజలు జీవిస్తున్నారు. సంవత్సరాల తరబడి వీరిని అనేక సమస్యలు వెంటాడు తున్నాయి. అనేకసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకున్న నాధుడు లేదు. పూర్తిస్థాయిలో త్రాగునీరు లేక సుదూర ప్రాంతాల నుంచి ఆటోలు, మోటార్ సైకిల్ మీద తెచ్చుకుంటున్నారు. కరెంటు సరఫరా సరిగా లేక లోవోల్టేజ్ సమస్యతో రాత్రి వేళల్లో కనీసం బుడ్డి కూడా వెలగడం లేదు. ఈ సమస్యలు పరిష్కరించాలని స్పందన జగనన్నకు చెబుదాం లాంటివాటిలో రెండుసార్లు ఫిర్యాదు చేసినా అధికారుల స్పందన కరువైంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సరిపల్లి శివారు గ్రామమైన బాబా నగర్ దళితులకు అన్ని గ్రామాల శివారు ప్రాంతాలకు త్రాగునీరు, నాణ్యమైన విద్యుత్తు అందించి సమగ్రంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులు మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు, పిడిఎస్‌యు విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు రేవు తిరుపతి రావుతో పాటు గ్రామస్తులు, నక్క సత్యనారాయణ, గెద్దం బాబులు, దాసరి భవాని, సాక కృష్ణ, ఎలిపే శ్రీదేవి, దాసరి మంగ, ఎలిపే సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ నెలవారీ నేర సమీక్ష

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ నెలవారీ నేర సమీక్షను గురువారం పెద్దాపురం, కాకినాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నిర్వహించారు. నేరాల నియంత్రణ కొరకు తీసుకోవలసిన చర్యలపై ప్రాధాన్యత క్రమంలో నిర్వహించవలసిన అంశాలు మహిళా ఫిర్యాదులపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని, తప్పిపోయిన బాలికల విషయాలలో త్వరితగతిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారి ఆచూకీ తెలుసుకోవాలన్నారు. హెల్మెట్ ధరించడం పై ప్రత్యేక కార్యాచరణను నిర్వహించాలన్నారు. బాధితులకు న్యాయం జరగాలంటే, నేరం జరిగాక ఘటనా స్థల పరిశీలన, సాక్ష్యాధారాలు సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు, ఛార్జిషీటు దాఖలు, స్పీడ్ కోర్ట్ ట్రయిల్స్ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులకు ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పి అడ్మిన్ పి.శ్రీనివాస్, ఎస్ఐబి అదనపు ఎస్పీ డాక్టర్ ప్రేమ్ కాజల్, ఆర్మ్ రిజర్వ్ అడిషనల్ ఎస్పీ బి సత్యనారాయణ, డిఎస్పీలు పి మురళీ కృష్ణారెడ్డి, లతా కుమారి, జయరాం ప్రసాద్, రెండు డివిజన్ పరిధిలో సీఐ, ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - రావులపాలెం : బుధవారం రావులపాలెం మండలం కేతరాజుపల్లి గ్రామ సచివాలయ పరిధిలో గ్రామ పంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ అంబటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. జడ్పిటిసి సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మొత్తం 215 మంది వైద్య సహాయం పొందారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బి. వెంకట లక్ష్మి, గ్రామ పెద్దలు బి. లక్ష్మి నారాయణ, పంచాయతీ వార్డు సభ్యులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. రాజేంద్ర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పి. ఫణి కుమార్, ప్రత్యేక వైద్యులు డాక్టర్ కె. శ్రీకాంత్, డాక్టర్ ఎస్‌కె నజీం బాను, డాక్టర్ కె. స్వాతి. అంగన్వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం లక్ష్యం

విశాలాంధ్ర - ఆలమూరు : ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్ విశేష కృషి చేస్తున్నారన్నారని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని పినపళ్ల గ్రామంలో గురువారం సర్పంచ్ సంగిత సుభాష్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంపిడిఓ కె. జాన్ లింకన్ పర్యక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు 368 మందికి మెరుగైన వైద్య సేవలు అందించి 105 రకాల మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం గ్రామంలో ఉన్న 11 మంది గర్భిణీ స్త్రీలకు నామాల యేసు రాజు (సాక్షి రాజు) సహకారంతో సీమంతాలు జరిగాయి. వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల వైసీపీ నాయకులు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్ల చిన్నారిపై వృద్ధుడు అత్యాచారయత్నం

విశాలాంధ్ర - రాజానగరం : ముక్కుపచ్చలారని చిన్నారులపై తమ కామవాంఛ తీర్చుకుంటున్న ప్రబుద్దులు సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్నారు. రాజానగరం సమీపంలో ఇటీవలే ఓ చిన్నారి పై జరిగిన సంఘటన మరవక ముందే రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని శానిటోరియం చెంచుకాలనీలో మరో దారుణం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చెంచు కాలనీలో నివసించే ఒక కుటుంబానికి చెందిన ఏడేళ్ల బాలిక తండ్రి సిగరెట్లు తీసుకురమ్మని ఇంటికి సమీపంలోని కిరాణా కొట్టుకు బుధవారం పంపగా అదే ప్రాంతానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు బాలికను దగ్గరకు రమ్మని పిలిచి ఎవరు లేని చోటకి తీసుకువెళ్లినట్లు చెప్పారు.బాలికకు చాక్లెట్లు ఇచ్చి ఒక్కొక్కటిగా బట్టలు తీయమని చెప్పి బాలిక మర్మాంగాన్ని తాకుతూ వికృత చేష్టలకు పాల్పడ్డాడని చెప్పారు. భయంతో ఇంటికి పారిపోయి ఆ వృద్ధుడు చేసిన అకృత్యం మొత్తం తల్లిదండ్రులకు వివరించిందన్నారు. వెంటనే బాలిక బంధువులు, స్థానికులు కలిసి కామాంధుడుని నిలదీసి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారన్నారు. సమాచారం అందుకున్న రాజానగరం ఎస్ఐ వై.సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన ఉదంతం పరిశీలించి దిశ డీఎస్పీకి సమాచారం అందించారు.ఎస్ఐ వై.సుధాకర్ గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నిందితుడు పై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేయగా డీఎస్పీ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి కామాంధులను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి.

జనసేన కార్యకర్తకు బీమా చెక్ అందజేత

విశాలాంధ్ర - ఆలమూరు : రోడ్డు ప్రమాదానికి గురై శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆలమూరు మండలంలోని బడుగువానిలంక గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త దూలం దేవత నాగేంద్రకు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మేరకు గురువారం పార్టీ మెడికల్ ఇన్సూరెన్స్ నుండి రూ.31,000లు చెక్కును కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బందారు శ్రీనివాస్ జనసేన పార్టీ నాయకుల సమక్షంలో నాగేంద్రకు అందజేశారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

సీఎం ఔదార్యంతో తక్షణ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాజానగరం మండలం దివాన్ చెరువు గ్రామంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న నేపథ్యంలో పలువురు అర్జీదారుల సమస్య తెలుసుకుని తక్షణం వారిని ఆదుకోవాలని ఆదేశించినట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అర్జీదారులకు కలెక్టర్ చెక్కులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. మాధవీలత వివరాలు తెలుపుతూ, మొత్తం ఆరుగురు అర్జీదారులకి రూ. 5 లక్షల యాభై వేల తక్షణ ఆర్థిక సహాయం అందించినట్టు పేర్కొన్నారు.

కార్గో డెలివరీ పై విస్తృతంగా ప్రచారం చేయాలి

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు డిపోలో కార్గో డోర్ డెలివరీ ప్రచారం విస్తృతంగా చేపట్టాలని కొవ్వూరు డిపో మేనేజర్ కుమార్ అన్నారు. కార్గో డెలివరీ మాసోత్సవం సందర్భంగా సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. డోర్ డెలివరీ కి సంబం ధించి 84 ముఖ్య పట్టణాల్లో 50 కేజీల వరకు పది కిలోమీటర్ల విస్తీర్ణం వరకు డోర్ డెలివరీ సదుపాయం ఉందని, ఈ విషయం ప్రయాణికుల వద్దకు చేరవేయాలని డిపో మేనేజర్ కుమార్ అన్నారు. ప్యాసింజర్ అయినా పార్సల్ అయిన క్షేమంగా వేగంగా గమ్యస్థానానికి చేర్చడం ఆర్టీసీ కే సాధ్యం అని తెలియజేస్తూ దసరా ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన ముమ్మిడివరం మండల జనసేన పార్టీ అధ్యక్షులు గోలకోటి వెంకన్న బాబు కుటుంబాన్ని ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చి బాబు) పరామర్శించారు. వెంకన్న బాబు మృతి జనసేన పార్టీకి వారి కుటుంబానికి తీరని లోటన్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకనంద, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, పొద్దుకు నారాయణ రావు, తాతాజీ, ఉదయ్, సాయిబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు ప్రారంభం

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్ళపూడి మండలంలో వరి కోతలను ప్రారంభించారు. పెద్దేవం తదితర ప్రాంతాల్లో ధాన్యం నూర్పిళ్లను, కొవ్వూరు వ్యవసాయ శాఖ ఏ.డి.ఏ చంద్ర శేఖర్‌తో కలిసి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు పలు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, రైతులంతా ప్రభుత్వము నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు కలిగిన ధాన్యం ఆర్.బి.కె ల ద్వారా అమ్మి కనీస మద్దతు ధర పొందవచ్చునన్నారు. రైతులు ధాన్యాన్ని మిల్లులకు జి.పి.ఎస్ ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా మాత్రమే పంపాలని, రైతులు మిల్లుకు వెళ్ళవలసిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్ళపూడి వ్యవసాయ శాఖాధికారి రుచిత, పెద్దేవం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చిక్కాల పరామర్శ

విశాలాంధ్ర - కరప : కరప మండలం వాకాడ గ్రామంలో ఇటీవల కాలంలో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రొక్కల నూక రాజు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు గురువారం పరామర్శించారు. నక్క నాగేశ్వరరావు అత్తమ్మ వేములవాడ గ్రామం సుంకర లక్ష్మి మృతి చెందగా వారి కుటుంబాన్ని చిక్కాల రామచంద్రరావు ఓదార్చారు. కుటుంబంలో పెద్ద దిక్కుగా ఉంటూ చనిపోవడం బాధాకరమని చిక్కాల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవు వెంకన్న, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యమే ముఖ్యమంత్రి ధ్యేయం

విశాలాంధ్ర - కిర్లంపూడి : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటి బాబు అన్నారు. గురువారం కిర్లం పూడి మండలం ఎస్ తిమ్మాపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రంతో పాటు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిం చారు. సర్పంచ్ మండేటి వీరలక్ష్మి, వైసీపీ నాయకులు వనపర్తి భద్రరావు, రాసబోయిన శ్యామ్, మండేటి పెద్దిరాజు, ఓలేటి రాజు, ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఎంపీపీ తోట రవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలు ఆరోగ్య సమస్యలతో బాధపడకూడదనే లక్ష్యంతో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైసిపి నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం

విశాలాంధ్ర - జగ్గంపేట : జగనన్న ఆరోగ్య సురక్ష పేదవారి ఆరోగ్యానికి వరమని వైసిపి నేత, కాకినాడ జిల్లా జెసియస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్ అన్నారు. జగ్గంపేట మండలం మామిడాడలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని రఘురామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పేదవారికి అత్యంత రక్షణ కల్పిస్తు న్నారని, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆలోచనా విధానం నుంచి పుట్టిన అద్భుతమైన పథకం జగనన్న ఆరోగ్య సురక్ష అన్నారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వసంత్ కుమార్, వైసిపి నాయకులు కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీతో అధికారం

విశాలాంధ్ర -భీమవరం: భవిష్యత్తుకు గ్యారెంటీ భీమవరం నియోజకవర్గ అవగాహన సదస్సును భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా టిడిపి అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అధ్యక్షతన గురువారం భీమవరంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మీ మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల లబ్ధిదారుల ఎంపికను నియోజకవర్గంలోని బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్చార్జులు జనసేన నాయకులతో కలిసి నవంబర్ 1 తేదీ నుండి నిర్వహించు భవిష్యత్తు గ్యారెంటీతోనే తెదేపా జనసేనలకు అధికారం రానున్నదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వేంద్ర శ్రీనివాస్, గూడూరి సుబ్బారావు, మెరగాని నారాయణమ్మ, ఎండి నౌషాద్, పామర్తి వెంకటరామయ్య, ఎద్దు ఏసుపాదం, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, బూత్ ఇన్‌చార్జిలు, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సాక్ష్యం, అంగన్‌వాడీ పోషణ స్కీములో పోస్టులు

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలోని సాక్ష్యం, అంగనువాడీ పోషణ స్కీములో ఏడాది ప్రాతిపదికన కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయడానికి జిల్లా కోఆర్డినేటర్, ప్రాజెక్టు అసిస్టెంట్, బ్లాక్ కోఆర్డినేటర్స్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మహిళా సంక్షేమ సాధికారత శాఖ అధికారి బి.సుజాతరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కోఆర్డినేటర్ ప్రాజెక్టు 30,000 వేతనమని ఐటి, సిఎస్ఇ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా చేసి ఉండాలని, కమ్యునికేషన్ స్కిల్, ప్రయాణం చేసే సామర్థ్యం ఉండాలన్నారు. ప్రాజెక్టు అసిస్టెంట్ కు 18,000 వేతనమని, మేనేజుమెంట్, సోషల్ సైన్స్, న్యూట్రిషన్ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా కలిగి ఉండాలన్నారు. బ్లాక్ కోఆర్డినేటర్స్ రెండు పోస్టులున్నాయని 20,000 వేతనమన్నారు. అన్ని పోస్టులకు కనీస వయస్సు 25, గరిష్ట వయస్సు 40 ఏళ్లని ఆమె తెలిపారు. విద్యార్హత సర్టిఫికెట్లను ఎటెస్టేషన్ చేయించి దరఖాస్తులను నవంబర్ 7వ తేదీలోపు జిల్లా కలెక్టరేట్ లోని రూమ్ నెంబర్ 202లోగల తమ కార్యాలయంలో అందచేయాలని ఆమె తెలిపారు. పోస్టులు రద్దు, పొడిగించడానికి జిల్లా కలెక్టరేట్ కు అన్ని అధికారాలు ఉన్నాయని ఆమె తెలిపారు.

ప్రధానోపాధ్యాయులకు పరీక్షల పై అవగాహన

విశాలాంధ్ర-భీమడోలు: భీమడోలు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు స్కూలు ఎడ్యుకేషన్ అచీవ్మెంట్ సర్వే పరీక్ష పై అవగాహన కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు, భాస్కర్‌కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 3న భీమడోలు మండలంలోని 25 పాఠశాలల యందు3,6,9 విద్యార్థులకు పరీక్ష జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో నాడు నేడు, ఉపాధ్యాయులు,విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకము, పాఠశాల భద్రత మొదలగు విద్యతో పాటు పలు విషయాలపై చర్చించారు. మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీగౌరమ్మ తల్లిని దర్శించుకున్న ధర్మరాజు

విశాలాంధ్ర-భీమడోలు: మండలంలోని సూరప్పగూడెం గ్రామంలో శ్రీ గౌరమ్మ తల్లి పూజా కార్యక్రమాలలో జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి పార్వతి, పాశం సురేంద్ర,వెజ్జు శేషరత్నం, పంజా రామలక్ష్మి ,తోట ధనలక్ష్మి ,చినిమిల్లి దుర్గ, కోటిపల్లి వేంకట పద్మ ,వేజ్జు పావని, వేజ్జురాంబాబు, బొర్రా నాగరాజు, పంతుల గంగాధరరావు, నెలప్రోలు శ్రీను, కర్రీ త్రిమూర్తులు,బొర్రా శాలివాహన, బొర్రా నాగరాజు,బండి అన్నవరం, వాసా మాధవ,వేజ్జు శ్రీకృష్ణ,కర్రీ పవన్,కర్రీ శశికాంత్, వేజ్జుమోహన్, కరుణాకర్,గ్రామ జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు ముసాయిదా జాబితా ప్రదర్శన

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ పంట నమోదు, ఈకేవైసీ చేయించిన రైతుల వివరాలను రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలలో ప్రదర్శించినట్లు మండల వ్యవసాయాధి కారి కె.పోశారావు తెలి పారు. రైతులు ఈ పంట నమోదు చేసుకోకపోయినా, చేసినటువంటి ఈ పంట నమోదులో, విస్తీర్ణంలో పంట నమోదులో ఎటువంటి ఫిర్యాదులు ఉన్న సంబంధిత రైతు భరోసా కేంద్రంలో ఈనెల 30వ తేదీ లోపు ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు.

శ్రీఅభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పెదపాడు: అప్పనవీడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీఅభయాంజ నేయస్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రం పూర్వభద్ర నక్షత్రం సందర్భంగా స్వామివారికి పసుపు కుంకుమతో అభిషేక ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి అభిషేకానికి పూజా సామాగ్రి అందించిన దాత శ్రీవిష్ణు వర్ధన్ రావు, వరాహలక్ష్మి వైజాగ్ అన్నదానం చేసిన దాత ఆళ్ల కృష్ణ రావు పద్మజ దంపతులు అందరికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి కూచిపూడి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర- పెదవేగి: గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం స్థానిక సర్పంచ్ పి.సత్యవతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్పీ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ ఆలోచనా విధానం నుండి పుట్టిన అద్భుత పథకమే ఆరోగ్య సురక్ష కార్యక్రమం అన్నారు. కార్యక్రమం విజయవంతం చేస్తూ గత నెల రోజుల నుండి కష్టపడుతున్న డాక్టర్లు, మండల స్థాయి అధికారులు అందరికీ జడ్పీ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ విజయబాబు, వైసిపి బిసి సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, ఎంపీపీ రమ్య కుమారి, మండల ప్రత్యేక అధికారి జివివి సత్యనారాయణ, మండల అభివృద్ధి అధికారి, తహసీల్దార్ మండల స్థాయి అధికారులు , స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర-ఆకివీడు : మండలంలోని కోళ్లపర్రు గ్రామంలో 21వ దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం అంగరంగ వైభవంగా అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పార్టీలకు అతీతంగా గ్రామస్తులందరూ కలిసి అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుంటా మన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి లడ్డు ప్రసాదాన్ని యర్ర సంగయ్య బ్రదర్స్ రూ. 51వేలకు వాడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదకాపు , కేశిరెడ్డి దిలీప్, యర్ర రవి, సాయి తో పాటు కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులు రైస్ మిల్లులకు వెళ్లాల్సిన అవసరం లేదు

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్: రైతులు రైస్ మిల్లు దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ధాన్యం కొనుగోలు సిబ్బందికి కస్టోడియంలో ఆర్బికే ఇన్‌చార్జిలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు టెక్నికల్ అసిస్టెంట్లు రైస్ మిల్లుల ప్రతినిధులకు కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు రైతు భరోసా కేంద్రం వరకే వెళ్లాలని ఇంకా మిల్లుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని తెలిపారు ఆర్డిఓ చెన్నయ్య మాట్లాడుతూ రైస్ మిల్లర్లు ఎవరు రైతులను మిల్లులకు పిలవద్దని తేమశాతం చూసే మిషను నూక శాతం చూసే మిషన్ సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. తేమ శాతం విషయంలో రైస్ మిల్లర్లు రైతులను ఏమైనా ఇబ్బంది పెడితే మిల్లును సీజ్ చేసి రెండు సంవత్సరాలు పాటు ధాన్యం కొనుగోలు ప్రక్రియకు దూరం పెడతామని తీవ్రంగా హెచ్చరించారు. రైస్ మిల్లుల ప్రతినిధులు సరిగా హాజరు కాకపోవడం పై అసహనం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు సిబ్బంది కోఆర్డినేషన్ చేసుకొని ఎక్కడా ఏ ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ మురళీకృష్ణ, పెంటపాడు తహసీల్దార్, రైస్ మిల్లుల ప్రతినిధులు, వీఆర్వోలు, అగ్రికల్చర్, టెక్నికల్ అసిస్టెంట్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కంచు బంగారం మృతి పార్టీకి లోటు

విశాలాంధ్ర-చాట్రాయి : తెదేపా సీనియర్ కార్యకర్త కంచు బంగారం మృతి పార్టీకి తీరని లోటని తెలుగు రైతు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు. చాట్రాయి మండలం చనుబండ గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ కార్యకర్త కంచు బంగారు(60) కన్నుమూశారు. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.టిడిపి ఆవిర్భావం నుంచి కంచు బంగారు టిడిపికి అంకితభావం కలిగిన కార్యకర్త అన్నారు. గురువారం ఉదయం మాజీ ఎంపీపీ కందుల కృష్ణ, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, వారి నివాసానికి వెళ్లి బంగారు భౌతికకాయంపై తెలుగుదేశం పతాకాన్ని కప్పి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. టిడిపి నాయకులు పరసా శ్రీనివాసరావు, బన్నే వీరస్వామి, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు చీదిరాల మారేశ్వరరావు యువ నాయకులు బొంతు సతీష్ ,పరసా శ్వేతా తదితరులు బంగారు భౌతికకాయం వద్ద నివాళు లర్పించారు.

డంపింగ్ యార్డు వద్ద ధర్నా

విశాలాంధ్ర-ఆకివీడు : ఈ దుర్భరం భరించడం మా వల్ల కాదని తమ గ్రామాలకు వెళ్లే రహదారిని చెత్తతో మూసివేస్తున్నారని గురువారం సిద్ధాపురం వంతెన వద్ద ఉన్న డంపింగ్ యార్డ్ వద్ద నగర పంచాయతీకి చెందిన చెత్త ట్రాక్టర్లు అడ్డ గించి ధర్మపురి అగ్రహారం, సిద్ధాపురం, రాజుల పేట, చిన్నమిల్లిపాడు గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు పది గ్రామాలకు వెళ్లే దారి వ్యర్థాలతోటి కప్పుకు పోతుందని చిన్నపాటి వర్షం వస్తే ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చుట్టుపక్క ఉన్న ప్రజలు చెత్త అంటించినప్పుడల్లా వచ్చే పొగ, దోమల వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని స్పందనలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి లేదని వాపోయారు. తక్షణమే ఈ సమస్య పరిష్కరించాలని ఆందోళన చేశారు. దీనితో నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్ ధర్నా వద్దకు చేరుకుని డిప్యూటీ కలెక్టర్ తో మాట్లాడి డంపింగ్ యార్డ్ ను వేరే చోటకి మార్చే ఏర్పాటు చేస్తామని ఆందోళనకారులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయి సీసీ రోడ్ల నిర్మాణం

విశాలాంధ్ర - ముదినేపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయి సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలం లోని పెదపాలపర్రు గ్రామంలో రూ.18.50 లక్షల వ్యయంతో నిర్మిం చిన పలు సిసి రోడ్లను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడి ఆరోగ్య రక్షగా జగనన్న ఆరోగ్యం సురక్ష ఉపయోగపడుతుందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు అనుభవజ్ఞులైన వైద్యుల చేత ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వారి సూచనలు మేరకు మందులు వాడాలన్నారు. వైద్య సేవలు వైయస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్యఆసరా, సంపూర్ణపోషణ, కంటివెలుగు, 104 సేవలు, వైద్య చదువులకు కళాశాలల ఏర్పాటు అన్ని విధాలుగా వైద్య విధానంలో మార్పులు తెచ్చిన సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ , జడ్పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ , రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ఎంపీటీసీ మేడేపల్లి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ మహెూత్సవ్ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర -కాళ్ళ : గురువారం నుంచి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం చేపడుతున్న 'ఖాదీ మహెూత్సవ్' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 'ఖాదీ మహెూత్సవ్' అంశంగా అన్ని పాఠశాలల్లో క్విజ్, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని కోరారు. క్విజ్ పోటీలో ఈ నెల 31 వరకు ఎవరైనా పాల్గొవచ్చన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలను పాఠశాల స్థాయిలో మండల స్థాయిలో 27న, జిల్లా స్థాయిలో 28న నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాలను భాషలు, కేటగిరీ వారీగా వివరాలను సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయానికి 29వ తేదీలోపు పంపాలని ఆర్జేడీలు, డీఈవోలు,సమగ్ర శిక్ష ఏపీసీలకు సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారని,ఎం ఈ ఓ లు ఏ. రవీంద్ర, కనక రాజు లు తెలియజేసారు.

మంచినీళ్లు ఇప్పించండి మహాప్రభో!

విశాలాంధ్ర-ఆకివీడు : మంచినీళ్లు ఇప్పించండి మహాప్రభో.. అంటూ గురువారం ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోని చిన పల్లె వీధి, పెద్దపల్లి వీధి, రజక వీధి ప్రాంత మహిళలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సుమారు 20

రోజుల నుండి త్రాగునీరు రావడంలేదని. కనీసం వాటర్ ట్యాంకర్ లో కూడా తాగునీరు సరఫరా చేయడం లేదని. అవార్డు కౌన్సిలర్ కు చెప్పిన పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందని. మహిళలు వాపోయారు. తక్షణమే శాశ్వత పరిష్కారం చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. దీనితో నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు తక్షణమే వాటర్ ట్యాంకర్లు ద్వారా త్రాగునీరు అందిస్తామని. శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి వర్మ, కవిటి నాయుడు, కారాడి దుర్గారావు, తలాడి భవాని, తామాడ వెంకట అప్పారావు, తామాడ రాములు, తాలాడి శ్రీలక్ష్మి, తామాడ సుబ్బలక్ష్మి, విజయలక్ష్మి, పెద్దింట్లు మహిళలు పాల్గొన్నారు.

అన్న సమారాధనకు లక్షా పదివేల విరాళం

విశాలాంధ్ర-గోకవరం: గోకవరంలోని శ్రీ వీరభద్రుడు గద్దెలో వెలసిన కనకదుర్గ అమ్మవారి ఆలయం శరన్నవరాత్రి మహెూత్సవ సందర్భంగా అన్న సమారాధన నిమిత్తం కమిటీ సభ్యులకు ఆధ్యాత్మికవేత్త ,హైదరాబాద్ వాస్తవ్యులు, ఆలయాల అభివృద్ధి ధ్యేయంగా శ్రమిస్తున్న కంబాల శ్రీనివాసరావు దంపతులు లక్షా పదివేల రూపాయలు విరాళాన్ని అందజేశారు. ఇప్పటికే మండలంలో పలు ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయన్ని కమిటీ సభ్యులు అభినందించారు. దసరా మహెూత్సవాలు ముగిసిన సందర్భంగా గద్దెలో శుక్రవారం జరిగే అన్న సమారాధనకు ప్రతి ఒక్కరూ విచ్చేసి అమ్మవారి ప్రసాదం స్వీకరించవలసిందిగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బత్తుల నానాజీ ఆలయ కమిటీ అధ్యక్షులు వాకచర్ల రవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు

సేవాతత్పరత అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - అనపర్తి : భగవంతుడు మనకిచ్చిన సంపదలో కొంతైనా ఏదో రూపంలో పేదలకు సహాయపడే విధంగా ఉపయోగించి సేవా తత్పరత అలవర్చుకోవాలని సనాతన పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు రెడ్డి సురేష్ శర్మ అన్నారు. గురువారం షిర్డీ సాయిబాబా 105 వ పుణ్యతిథి వేడుక పురస్కరించుకుని స్థానిక సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జిబిఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ సత్తి వీర వెంకట సత్యనారాయణ రెడ్డి రమా కుమారి దంపతులు వృద్ధులు,యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు కర్రి వీర్రాఘవరెడ్డి, అంజిరెడ్డి, రెడ్డి సతీష్, జాహ్నవి, రూపిణి, గంగా మోహనలక్ష్మి, వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

విశాలాంధ్ర - దేవరపల్లి : సామాజిక సేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మానవతా సంస్థ రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ పేర్కొన్నారు. దేవరపల్లిలో జై కిసాన్ వృద్ధాశ్రమంలో దేవరపల్లికి చెందిన గట్టు సత్యనారాయణ మూర్తి రమా సావిత్రి దంపతులు వృద్ధులకు భోజనం, దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ సమాజ సేవలో స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వస్తే ప్రభుత్వం కూడా చేయూత ఇస్తుందని అన్నారు. వృద్ధుల సంరక్షణ బాధ్యత తీసుకుంటున్న వృద్ధాశ్రమ నిర్వాహకుడు దెయ్యాల భీమరాజును అభినందించారు. దేవరపల్లికి చెందిన గట్టు సత్యనారాయణమూర్తి రమా సావిత్రి దంపతుల కుమార్తె చెక్క లక్ష్మీ అనూష పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు భోజనంతో పాటు దుస్తులు, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా గుర్తు సత్యనారాయణమూర్తి రమా సావిత్రి దంపతులను ఆశ్రమం నిర్వాహకుడు భీమరాజు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ ఉపాధ్యక్షుడు పప్పు వెంకట రామారావు, సభ్యులు ఎల్లమాటి సత్యనారాయణ, బండి సూర్యప్రకాశరావు, ఈదుపుగంటి నాగేశ్వర రావు, ఆచంట సుభాష్ చంద్రబోస్, గ్రంధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ అధ్యక్షునిగా వెంకట స్వామి

విశాలాంధ్ర - తాళ్లపూడి : పెద్దేవం గ్రామ కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన చింతా వెంకట స్వామి, వైస్ ప్రెసిడెంట్ బట్టు సుబ్బారావు, మండల ఎగ్జిక్యూటివ్ నెంబర్ గా నియమితులైన చామకురి సత్యనారాయణ లను గ్రామ సచివాలయంలో వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు తోట రామకృష్ణ, సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పలువురు వైకాపా నాయకులు, పంచాయతీ వార్డు మెంబర్లు పాల్గొని వీరికి శుభాకాంక్షలు తెలియజేసారు.

ఘనంగా దుర్గా మాత ఊరేగింపు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : దేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం గొల్లప్రోలు పట్టణంలోని స్థానిక కరణం తోటలోని కొలువైన దుర్గా మాత ఊరేగింపు కార్యక్రమం పట్టణ వీధుల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్లపై కనుపరిచిన వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. అమ్మవారిని ఊరేగించేందుకు ఏర్పాటు చేసిన పూల రథం ప్రత్యేకంగా ఆకర్షించింది. భజనలు,భక్తి గీతాలతో దుర్గామాతను గంగ ఒడిలోకి సాగనంపారు.

రెడ్డి చెరువులో బాబుతో నేను

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: స్కిల్ డెవలప్మెంట్ కేసులో అక్రమంగా రిమాండ్ కు గురైన చంద్రబాబుకు సంఘీభావంగా బాబుతో నేను, బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ అనే నినాదంతో నిర్వహించే కార్యక్రమం గురువారం మండలంలోని రెడ్డి చెరువులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిడదవోలు నియోజకవర్గ టిడిపి నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ గ్రామంలోని ఇంటి ఇంటికి తిరిగి, కరపత్రాలు పంచుతూ, చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో చెల్లంకి మురళీకృష్ణ, చెల్లంకి ఇంద్రరావు, పిల్లి కేశవరావు, కేతా సత్యనారాయణ, గుత్తుల నాగేశ్వరావు, చెల్లంకి భాస్కరరావు, కట్టా నాగరాజు, బొక్కా వీరాస్వామి, రెడ్డి చెరువు గ్రామ తెలుగు దేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

29న జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2023

విశాలాంధ్ర-రాజమండ్రి: ప్రారంభించిన రోజు నుంచీ ప్రతిభావంతులైన కళాకారులు, దర్శకులు,రచయితలు,నిర్మాతలు,చిత్రబృందం అచంచలమైన అంకితభావంతో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టడంలో జీతెలుగు తిరుగులేని ఎదుగుదల కొనసాగుతోందని ఆ ఛానెల్ ప్రతినిధి చెప్పారు. ప్రతిష్ఠాత్మక జీ తెలుగు కుటుంబ అవార్డులను ప్రదానం చేయడం ద్వారా అదే ఉత్సాహంతో ముందుకు సాగాలని నటీనటులను ప్రోత్సహిస్తుందన్నారు. ప్రతి ఏటా వైభవంగా జరిగే జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ వేడుక ఈసంవత్సరం మరింత ఘనంగా జరిగిందని, జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2023 వెండితెర, బుల్లితెర తారల తళుకులుతోఅత్యంత వైభవంగా సాగిన కుటుంబం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమ మొదటి భాగం అక్టోబర్ 29సాయంత్రం 6గంటలకు ప్రారంభం కానుందన్నారు. అద్భుతమైన ప్రదర్శనలతో వినోదంగా సాగే ఈ కార్యక్రమంలో అభిమాన నటులు ఏ అవార్డు గెలుచుకున్నారో తెలుసుకోవాలంటే మిస్ అవకుండా చూడాల్సిందేనని, అంగరంగ వైభవంగా సాగిన కార్యక్రమానికి ఎనర్జిటిక్ యాంకర్ శ్యామల వ్యాఖ్యాతలుగా వ్యవహరించారని చెప్పారు.

మధుమేహ రోగుల కోసం డాక్టర్ రెడ్డీస్ 'సెలెవిడా వెల్‌నెస్'

విశాలాంధ్ర-రాజమండ్రి : గ్లోబల్ ఫార్మాస్యూటికల్ కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్, నేడు తన పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ స్వాస్ వెల్‌నెస్ లిమిటెడ్ ద్వారా మధుమేహ రోగుల కోసం తన మొదటి డైరెక్ట్-టు-కన్స్యూమర్ ఇ-కామర్స్ వెబ్‌సైట్ 'సెలెవిడా వెల్‌నెస్'ని ప్రారంభించామని ప్రకటించింది. టైప్ 2 డయాబెటిక్, ప్రీ-డయాబెటిక్ వ్యక్తుల కోసం వ్యక్తిగతీకరించిన డయాబెటిక్ సంరక్షణ అందించేందుకు 'సెలెవిడా వెల్‌నెస్' ఒన్-స్టాప్ పరిష్కారంగా మారాలని లక్ష్యంగా పెట్టుకుందని ఎం.వి. బ్రాండెడ్ మార్కెట్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమణ చెప్పారు. డయాబెటిక్ రోగి రోజువారీ పోషకాహార అవసరాన్ని చూసుకునే మరియు అదే సమయంలో రోజులో మొత్తం పూర్తి సందర్భానికి గతిన ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను అందించేందుకు వెబ్‌సైట్ సెలెవిడా శ్రేణి ఉత్పత్తులను, అలాగే ఇతర థర్డ్ పార్టీ బ్రాండ్‌లు అంటే, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, స్నాక్స్, పానీయాలు, భోజనం రీప్లేస్‌మెంట్ మొదలైన వాటిని హెూస్ట్ చేస్తుందన్నారు. ఉత్పత్తులు వాటి పోషక కూర్పుపై కఠోరమైన శ్రద్ధతో కూడిన అధ్యయనంతో, కఠినమైన ఉత్పత్తి ఎంపిక ప్రక్రియ తర్వాత ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులో ఉంచుతారని, వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఉత్పత్తులను ప్రస్తుతం భారతదేశం వ్యాప్తంగా 18,000 కన్నా ఎక్కువ పిన్ కోడ్‌లకు సేవలు అందించనున్నామని చెప్పారు.

కొత్త పార్టీ వేర్ వాచ్ వీవైబీ

అందుబాటులోకి తీసుకువచ్చిన ఫాస్ట్రాక్

విశాలాంధ్ర- కాకినాడ: భారతదేశపు ఐకానిక్ యూత్ బ్రాండ్, ఫాస్ట్రాక్, ఇటీవల యువతుల కోసం ప్రత్యేకంగా ఒక సబ్-బ్రాండ్ అయిన వీవైబీని ప్రారంభించింది. చిక్, స్టైలిష్ మరియు వినూత్నమైన వీవైబీ ట్రెండ్‌లు తాజా డిజైన్‌ల ప్రపంచాన్ని ఆస్వాదించే ఫ్యాషన్‌వాదులకు అంకితం చేయబడింది. ప్రస్తుత ఫాస్ట్-ఫ్యాషన్ ప్రాధాన్యతలపై దృష్టి సారించి, వీవైబీ బై ఫాస్ట్రాక్ అన్ని రకాల పార్టీల కోసం అందాన్ని మెరుగుపరిచే అద్భుతమైన, విలువైన పీస్ ల కోసం వెతుకుతున్న వారికి అందిస్తుంది. మొదటి కలెక్షన్ డ్రాప్‌లో 71 ఉత్కంఠభరితమైన డిజైన్‌లు ఉన్నాయి. విభిన్నమైన మరియు అలంకరించబడిన పట్టీలు, కొత్త ప్లేటింగ్ రంగులు మరియు ఆసక్తికరమైన డయల్ ఆకారాల శ్రేణితో, బ్రాండ్ ప్రతి మూడ్ మరియు క్షణానికి వాచ్ ఉండేలా చేస్తుంది. అన్నింటికంటే అగ్రగామిగా, ఈ వాచీలు సరసమైన ధర శ్రేణి లో రూ. 1250/- నుండి రూ. 2960/- మధ్య లభిస్తాయి. వీవైబీ విడుదలతో, ఫాస్ట్రాక్ తన పోర్ట్‌ఫోలియోను కొత్త డిజైన్లతో విస్తరింపజేస్తుంది, ఇది ఫ్యాషన్-ఫార్వర్డ్ యువతుల కోసం బ్లింగ్ టచ్ కలిగి ఉంది, వారి స్వేచ్ఛా స్ఫూర్తితో కూడిన పార్టీ వైబ్‌ను అత్యంత విశ్వాసంతో ప్రదర్శించేలా వారిని ప్రోత్సహిస్తుంది.

ఘనంగా ఎల్‌ఐసి ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జవహర్ వీధి వెంకీ రెసిడెన్సీలో లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా దేశ భక్తి గీతం, జీవిత భీమా నిఘామ్ పాటను చప్పట్లతో జ్యోతి ప్రజ్వలన ముఖ్య అతిథులు చేతులు మీదుగా ప్రారంభించారు. రాజమండ్రి ఎల్ఐసి డివిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఎల్ఐసి లీడర్స్ మరియు జోనల్ లీడర్స్ మరియు ఏజెంట్లు అందరూ కలిసి ఏజెంట్ల సమస్యలు పలుమార్లు కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీతావిశ్వనాథ్ పార్లమెంటులో ప్రసంగించి ఎల్ఐసి చైర్మన్‌ను, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కలిసి ఏజెంట్లు సమస్యలు వివరించి ఏజెంట్ల తరఫున రిప్రెంటేషన్ ఇచ్చినందున ఏజెంట్ల కొన్ని సమస్యలు పరిష్కరించునందున గాను కృతజ్ఞతతో ఆత్మీయ సమావేశం ఘనంగా ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో ఎంపి వంగా గీత విశ్వనాథ్‌ను పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రావుల మాధవరావు, రాజమండ్రి ఎల్ఐసి డివిజనల్ కౌన్సిల్ ప్రెసిడెంట్ జెడ్ఆర్‌యుసిసి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అధ్యక్షులు ఎల్ఐసి ఏజెంట్లను ఘనంగా పలువురిని సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపి వంగా గీత విశ్వనాథ్‌ను సభ్యులు సన్మానించారు.

రాష్ట్రంలో నియంతపాలన

విశాలాంధ్ర-దేవరపల్లి :రాష్ట్రంలో అరాచకాలు నియంత పరిపాలన కొనసాగుతోందని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. దేవరపల్లి మండలం దుద్దు కూరులో గురువారం రాత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా బాపిరాజు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష పార్టీలపైన నాయకుల పైన కార్యకర్తల పైన అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేస్తున్నదన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పొత్తు వలన వైసీపీ ఘోరంగా ఓడిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కే రవికుమార్, నిమ్మకంట సత్తిబాబు, కాకర్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - ఆలమూరు : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని స్థానిక పెద్దపళ్ళ పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్ సుదర్శన్ బాబు ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమని వైఎస్ఆర్సిపి రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు, పిఎసిసి అధ్యక్షులు నెక్కంటి వెంకటరాయుడు(బుజ్జి) అన్నారు. గురువారం గ్రామ సర్పంచ్ ఏడిద సత్యశ్రీ మెహర్ ప్రసాద్ అధ్యక్షతన వైద్యాధికారి డాక్టర్ పి భవాని శంకర్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ అనుబంధ మెడికల్ కళాశాలలో వైద్యాధికారి సుదర్శన్ బాబు మాస్టర్ ఆఫ్ సర్జన్ (ఎంఎస్) మూడేళ్ల శిక్షణకు ఎంపికైన సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇప్పటివరకు వైద్యాధికారిగా పనిచేసిన సుదర్శన్ బాబు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించి జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.